క్లుప్తంగా

ట్రంప్ సుంకాలతో ఆక్వా రైతు కుదేలు

బోట్‌క్లబ్: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారతదేశం నుంచి అమెరికాకు ఎగుమతి అవుతున్న వ్యవసాయ, ఆక్వా తదితర ఉత్పత్తులపై పన్నులు 50 శాతం విధించడంతో ఆక్వా పరిశ్రమ ఒక్కసారిగా కుదేలై రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు అన్నారు. ఈ సందర్భంగా మధు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆక్వా పరిశ్రమ సంక్షోభంలో పడి రైతులు దివాళ తీసే ప్రమాదం ఏర్పడిందని, దీని వలన దేశ ఆర్థిక వ్యవస్థ దిగజారిపోతుందని నిపుణులు అభిప్రాయ పడుతున్నారన్నారు. కాకినాడ జిల్లాలో ఆక్వా రంగ పరిశ్రమలో వందలాది మంది కార్మికులు పని చేస్తున్నారని ట్రంప్ విధానాలతో పరిశ్రమలు మూత పడితే మహిళల ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పులు చేసి రైతులు చెరువులు వేశారని ఈ దెబ్బతో రైతులు తీవ్ర నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జిల్లా మంత్రి పవన్ కల్యాణ్ ప్రధాని మోదీతో మాట్లాడి ఈ సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేయాలని మధు కోరారు.

సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎక్సైజ్ ఎస్సై వరహాలు

కాకినాడ రూరల్: సారా రహిత గ్రామంగా రూరల్ మండలంలోని సూర్యారావుపేటను తీర్చిదిద్దేందుకు గ్రామస్తులు సహకరించాలని ఎక్సైజ్ ఎస్సై వరహాలు కోరారు. నవోదయం 2.0 పథకంలో భాగంగా ఎక్సైజ్ నార్త్ స్టేషన్ సీఐ రామ్మోహన్ ఆధ్వర్యంలో సిబ్బంది సూర్యారావుపేటలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలో సారా వలన కలిగే అనర్థాలు, ప్రభుత్వం చేపడుతున్న చర్యలు తదితర వాటిని ఎక్సైజ్ ఎస్సై వరహాలు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మీదేవి, వీఆర్వోలు చిన్నా, సరస్వతి, హెచ్‌సీ కనకరావు, గ్రామ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

బోట్‌క్లబ్: బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం పార్టీ వెస్ట్ మండల అధ్యక్షుడు దొడ్డి వీరేంద్ర ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, సీనియర్ నాయకులు పైడా కృష్ణమోహన్ ఈ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. పీఆర్ కళాశాల విద్యార్థులు 100 మీటర్ల త్రివర్ణ పతాకంతో స్థానిక మెయిన్‌రోడ్డు మీదుగా సినిమారోడ్డు వరకూ ర్యాలీ నిర్వహించారు. నాయకులు చెల్లూరి సత్యనారాయణ, కరుటూరి ప్రసాద్, చెక్కా రమేష్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

కాకినాడ క్రైం: కాకినాడ బాలాజీ చెరువు జంక్షన్‌లో ఉన్న టీటీడీ కల్యాణ మండపంలో స్వీపర్‌గా పనిచేస్తున్న ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అక్కడే వాచ్‌మన్‌గా పనిచేస్తున్న ఆమె భర్త కుశ్వంత్ మాట్లాడుతూ భార్యను మేనేజర్ దుర్భాషలాడుతుండడం వల్ల ఆత్మహత్యకు యత్నించిందని అన్నాడు. పురుగుల మందు తాగిన ఆమెను భర్త కాకినాడ జీజీహెచ్‌లో చేర్చాడు. వైద్య సేవలు కొనసాగుతుండగా మహిళ ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.



కరపలో శివాలయానికి వెళ్లే రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు



కరపలో మండల విద్యావనరుల కేంద్రానికి వెళ్లే రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

ముంచెత్తిన వర్షం

- జలమయమైన వీధులు, రహదారులు
- స్తంభించిన జనజీవనం

కరప: ఎండ తీవ్రతకు అల్లాడుతున్న జనం మంగళవారం మధ్యాహ్నం ఆకాశం మబ్బుపట్టి ఈదురుగాలులతో వర్షం పడడంతో సేదతీరారు. గంట పాటు కుండపోత వర్షానికి గ్రామాలన్నీ జలమయమయ్యాయి. వీధులన్నీ చెరువులను తలపించాయి. ఎక్కడికక్కడ వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జనజీవనం స్తంభించింది. పలు గ్రామాల్లో పూర్తిస్థాయిలో డ్రైన్లులేక రోడ్డుపైనే నీరు నిలబడిపోయింది. నడకుదురు, కరప, వలసపాకల, గురజనాపల్లి గొడ్డటిపాలెం తదితర గ్రామాల్లోని మెయిన్‌రోడ్లు, కాలనీలు, శివారుప్రాంతాలు బురదమయమై ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. కరప, గురజనాపల్లి, గొర్రిపూడి తదితర గ్రామాల్లోని హైస్కూల్ గ్రౌండ్‌లలో నీరునిలబడి పోయి చిత్తడి,చిత్తడిగా మారింది. కరపలోని మండల విద్యావనరుల కేంద్రం, పోలీసుస్టేషన్‌వద్ద, శివాలయానికి వెళ్లే దారి వద్ద నీరు నిలిచిపోయింది. కరపలోని సీతమ్మవీధి, పేపకాయలపాలెంరోడ్డు పైనుంచే నీరు ప్రవహించింది. అయితే ఈవర్షం సార్వా పంటకు మేలు చేస్తుందని రైతులు తెలిపారు. అరట్లకట్ట, వాకాడ, నడకుదురు, యండమూరు, పెద్దాపురప్పాడు గ్రామాల్లో విద్యుత్ తీగలపై చెట్లకొమ్మలు విరిగి పడడంతో విద్యుత్‌సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. కాకినాడ, రామచంద్రపురం రోడ్డుపై గంట పాటు ట్రాఫిక్ స్తంభించింది. కరప సబ్‌స్టేషన్ ఏఈ సానా ఈశ్వరప్రసాద్ సిబ్బందితో యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు.



కరపలో పడుతున్న వర్షం



కరపలో చిత్తడిగా మారిన హైస్కూలు క్రీడామైదానం

వానొస్తే.. వరదే..

- జలమయమైన జీజీహెచ్
- మునిగిపోతున్న ఆసుపత్రిలోని ప్రధాన కేంద్రాలు
- సక్రమంగా లేని డ్రైనేజీ వ్యవస్థ
- ఎక్కడికక్కడ నిలిచిన మురుగునీరు
- నిర్మాణ ప్రణాళికలో లోపం.. రోగులకు శాపం..



జీజీహెచ్‌లో నిలిచిన వర్షంనీటిని తోడుతున్న పారిశుధ్య కార్మికుడు

కాకినాడ క్రైం: వానొచ్చెనంటే వరదొస్తది అన్నట్టు తయారైంది కాకినాడ జీజీహెచ్ పరిస్థితి. మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి జీజీహెచ్ జలమయమైంది. ఆసుపత్రిలో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోవడంతో రోగులు, వారు బంధువులు ఇబ్బంది పడ్డారు. సరైన డ్రైజేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షంనీరు బయటకు పోయే మార్గం లేక ప్రధాన కేంద్రాలు నీట మునిగాయి. ఆ నీరు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో రోగులు అందులో నడుస్తూనే ఆరోగ్య అవసరాలు తీర్చుకుంటున్నారు. వందలాది వాహనాలు ఆ నీటిలోనే ఉండిపోయాయి.

మురుగునీరు నిలిచిపోవడంతో...

జీజీహెచ్ ప్రవేశం మొదలు వాహనాలు నిలిపే పార్కింగ్‌ల వరకు దాదాపు అన్ని ముఖ్యమైన ప్రాంతాల్లోనూ చిన్నపాటి వర్షం పడినా చాలు వరద నీరు వచ్చి చేరుతుంది. ఆసుపత్రి ప్రవేశం, అంబులెన్సుల పార్కింగ్ ప్రాంతం, ఏడో నంబరు ల్యాబ్, 24 గంటల ల్యాబ్, సఖి వన్ స్టాప్ సెంటర్, నూతనంగా నిర్మిస్తున్న ఎంసీహెచ్ బ్లాక్ పక్కన మార్చురీకి వెళ్లే మార్గం, సర్జికల్ భవంతి వద్ద రోగులు వేచి ఉండే ప్రదేశం, సుభోజనం, జన్మభూమి సత్రం, అత్యవసర విభాగం కాన్సర్ వార్డుల మధ్య మార్గం, కాన్సర్ ఓపీ పార్కింగ్ ప్రదేశం నిత్యం ముంపు నీటితో నిండి ఉంటాయి. మంగళవారం మధ్యాహ్నం కురిసిన చిన్నపాటి వర్షంతో ఈ ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. దీంతో పారిశుధ్య సిబ్బంది ఆ నీటిని తోడుతూ పడరాని పాట్లు పడుతున్నారు. బకెట్లు, మగ్గులతో తోడుతూ నీటిని పల్లపు ప్రాంతం నుంచి డ్రైనేజీలకు చేర్చుతున్నారు. వర్షం పడిన ప్రతీసారి వారికి నరకంగా మారుతుంది.



జీజీహెచ్‌లో ప్రవేశ మార్గం వద్ద నిలిచిన వరదనీరు

ఎందుకిలా...

కాకినాడ జీజీహెచ్‌లో పల్లపు ప్రాంతాలు అధికంగా ఉన్నాయి. వర్షం వచ్చిన సమయంలో నీరు పల్లపు ప్రాంతాల్లో చేరి సమస్యలకు కారణమవుతోంది. అలాగే పలు చోట్ల కేవలం మట్టి నేలలే అక్కడ, సిమెంట్ లేదా తారుతో ఉపరితలాల నిర్మాణం ఏదీ లేదు. దీంతో వర్షం వచ్చినప్పుడు వరదతో పాటు బురదమయంగా మారుతుంది. ఆసుపత్రిలోని సామాన్య ప్రజల పార్కింగ్ ప్రదేశాలన్నీ దాదాపు మట్టితోనే ఉంటాయి. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు బయటకు వెళ్లే మార్గంలేక ఇబ్బంది పడుతున్నారు.

ఇదీ పరిష్కార మార్గం

ఆసుపత్రి నిర్మాణ ప్రణాళికలో ఇంజినీరింగ్ లోపం స్పష్టంగా కనిపిస్తోందని నిర్మాణ నిపుణులు చెబుతున్నారు. ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలసిన అధికారులు పట్టించుకోవడంలేదు. ఆసుపత్రిలో డ్రైనేజీ వ్యవస్థను మరింత మెరుగుపరచాలి. ఆసుపత్రి మధ్య నుంచి నీటి ప్రవాహానికి అనుసంధానం ఏర్పాటు చేయాలి. నీరు స్తంభించిపోకుండా సరైన డ్రైనేజీలను ఏర్పాటు చేయాలి. లోతైన ప్రాంతాలు పూడ్చి, పార్కింగ్ ప్రదేశాలను సిమెంట్ ఫ్లోరింగ్ చేయించాలి.



సర్జికల్ భవంతి వద్ద రోగులు వేచి ఉండే ప్రదేశంలో నిలిచిన వర్షంనీరు



సుభోజనం భవనం ముందు నిలిచిన వరద

గ్రంథాలయాలు దేవాలయాలతో సమానం

బాలాజీచెరువు: గ్రంథాలయాలు దేవాలయాలతో సమానమని, గ్రంథాలయాలే విద్యార్థులకు మార్గదర్శకాలని ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ పీఎస్ఎస్ కిరణ్ పేర్కొన్నారు. ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం పద్మశ్రీ డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ జయంతి సందర్భంగా లైబ్రేరియన్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ రంగనాథన్ భావితరాల కోసం చేసిన గ్రంథాలయ సేవలు కొనియాడారు. కళాశాల డైరెక్టర్ కృష్ణంరాజు మాట్లాడుతూ స్వాతంత్య్ర సమర పోరాటంలో గ్రంథాలయాల పాత్ర ఎనలేనిదని, మానవ మనుగడకు, విజ్ఞానానికి భావితరాల అభివృద్ధికి గ్రంథాలయాల్లో వాటిని నిర్వహించే గ్రంథపాలకుల సేవ మరవలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.శ్రీకాంత్, ఏవో జీవీకే వర్మ లేబ్రేరియన్ సాయి బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు. గాంధీనగర్ గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ లేబ్రేరియన్ సలాది సాయిసత్యనారాయన, లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు పాల్గొని రంగనాథన్ సేవలు కొనియాడారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం

కాకినాడ రూరల్: స్థానిక రమణయ్యపేట అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ విశ్రాంత అధికారి చింతపల్లి సుబ్బారావు మాట్లాడుతూ భారతదేశ గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథం గ్రంథాలయ శాస్త్ర అభివృద్ధికి, గ్రంథాలయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో చింతపల్లి సుబ్బారావును ఘనంగా సత్కరించారు. తొలిత ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ భూతాన్ని తరిమివేయాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి ఆనంది

కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో జాతీయ ర్యాగింగ్ వ్యతిరేక దినోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవల కమిటీ చైర్మన్ జి.ఆనంది హాజరయ్యారు. ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి 500 మందికి పైగా వైద్య విద్యార్థులు హాజరయ్యారు. జడ్జి ఆనంది మాట్లాడుతూ కొన్నేళ్ల క్రితం హిమాచల్ ప్రదేశ్‌లో ఓ వైద్య విద్యార్థి ర్యాగింగ్‌కు బలికావడంతో ఈ దారుణాన్ని నిరసిస్తూ జాతీయ ర్యాగింగ్ వ్యతిరేక దినాన్ని ప్రతి ఏడాది ఆగస్టులో 12వ తేదీన జరుపుకొంటున్నామన్నారు. బాధ్యులైన వైద్యులుగా ర్యాగింగ్‌ను పూర్తిగా వ్యతిరేకించాలన్నారు. రంగరాయలో యాంటీ ర్యాగింగ్ కమిటీ పనితీరు బాగుందని కితాబిచ్చారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ శశి తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో మెడికల్ డిస్పెన్సరీ ఏర్పాటు

కాకినాడ క్రైం: కాకినాడ జిల్లా కోర్టు ఆవరణలో మెడికల్ డిస్పెన్సరీ(మందుల పంపిణీ కేంద్రం) ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి జిల్లా కోర్టు ఆవరణలో తప్పకుండా మెడికల్ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలన్న నిబంధనల నేపథ్యంలో అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ డిస్పెన్సరీలో వైద్యాధికారి డాక్టర్ నిహారిక, స్టాఫ్ నర్సు షేక్ మున్నీ, అసిస్టెంట్ సేవలందిస్తారన్నారు. ఈ నేపథ్యంలో డాక్టర్ నరసింహ నాయక్ జిల్లా జడ్జి ఆనందిని ఆమె ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

వైద్య సేవల బలోపేతానికి చర్యలు

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌లో వైద్య సేవల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందులో భాగంగా క్యాథ్ ల్యాబ్ నిర్వహణను ఓ సంస్థకు అప్పగించడంతో పాటు త్వరలో సీటీ స్కాన్ యంత్రం కొనుగోలుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టెర్షరీ కేర్ ఆసుపత్రుల వసతుల కల్పన సమాహారంగా వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు జీవో విడుదల చేశారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

కాకినాడ క్రైం: నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా జిల్లాలో ఉన్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 1–19 ఏళ్ల మధ్య వయసున్న బాలలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కాకినాడలోని గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిర్ణీత లక్ష్యంలో 92.48 శాతం మంది పూర్తయిందని డీఎంహెచ్‌వో తెలిపారు. నూరు శాతం లక్ష్యం చేరుకునేందుకు పంపిణీ కొనసాగిస్తున్నామన్నారు.

వ్యక్తికి ఆరు నెలల జైలు

కాకినాడ లీగల్: చెల్లని చెక్కు ఇచ్చిన వ్యక్తికి ఆరు నెలల జైలు, రూ.15 లక్షల పరిహారం విధిస్తూ కాకినాడ రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్.మణి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాకినాడ గాంధీనగర్ చెందిన కొలురి మధుసూదనరెడ్డి వద్ద నుంచి కాకినాడ శశికాంత్ నగర్ చెందిన చెల్లూరి వెంకటరావు 2017లో రూ.15 లక్షల అప్పు తీసుకున్నాడు. బాకీ తీర్చేందుకు 2019లో రూ.15 లక్షల చెక్కు ఇచ్చారు. చెక్కును మధుసూదనరెడ్డి బ్యాంక్‌లో వేయగా బౌన్స్ కావడంతో కోర్టును ఆశ్రయించాడు. కోర్టు విచారణలో వెంకటరావుపై నేరం రుజువు కావడంతో ఆరు నెలల జైలు, రూ.15లక్షల పరిహారం విధిస్తూ తీర్పు చెప్పారు.

ఎస్‌టీఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

బోట్‌క్లబ్(కాకినాడసిటీ): అఖిల భారత స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీఎఫ్ఐ) 26వ ఆవిర్భావ దినోత్సవం యూటీఎఫ్ హోంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం అసోసియేట్ అధ్యక్షుడు ఐ.ప్రసాదరావు మాట్లాడుతూ విద్యారంగంలో ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ, మతతత్వంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం చరిత్ర పాఠాలను తిరగరాసే ప్రయత్నాలు ముమ్మరం చేసిందన్నారు. పాఠ్యాంశాల నుంచి అభ్యుదయ, ప్రజాస్వామ్య పదాలు, అంశాలను తొలగించి, మత పరమైన అంశాలు జోడిస్తోందన్నారు. విశ్వవిద్యాలయాల్లో రాజకీయ జోక్యం పెరుగుతుందని, మతాధిపతులను, పీఠాధిపతులను వైస్ ఛాన్సలర్లగా నియమిస్తుందన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కె.సత్తిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్, జిల్లా కార్యదర్శులు పెద్దిరాజు, రాజబాబు, కాకినాడ సిటీ అధ్యక్షుడు వరహాల బాబు, జన విజ్ఞాన నాయకులు జీపి వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు జీవన భద్రత కల్పించాలి



జీవన భద్రత కల్పించాలని జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు

బోట్‌క్లబ్(కాకినాడసిటీ): ఆటో డ్రైవర్లకు జీవన భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఉదయం సీఐటీయూ ఆధ్వర్యంలో స్మార్ట్ సిటీ ప్యాసింజర్ ఆటో ఓనర్లు, డ్రైవర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ ఆటో స్టాండ్ లకు చెందిన ఆటో డ్రైవర్స్ కాకినాడ బాలాజీ చెరువు సెంటర్ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా శిబిరంలో అసోసియేషన్ అధ్యక్షుడు నురుకుర్తి సూర్య ప్రకాశరావు మాట్లాడుతూ ఆటోలకు ముఖ్య ప్రయాణికులు మహిళలే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా కొత్త విధానం తీసుకుని వచ్చేటప్పుడు దాని ప్రభావం ఎలా ఉంటుందో ముందుగానే ఆలోచించాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అయితే ఆటో డ్రైవర్స్ జీవనానికి భద్రత కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అన్నారు. ఆటోకు ఇంధనం వేయించి నెలకు రూ.26 వేలు చెల్లిస్తే ప్రభుత్వ నిబంధనలకు లోబడి రోజుకు 8 గంటల పాటు మహిళలను తమ గమ్యస్థానాలకు ఉచితంగా చేర్చడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. నగర ప్యాసింజర్ ఆటో యూనియన్ నాయకులు తాతపూడి మూర్తి మాట్లాడుతూ రాపిడో వల్ల కూడా ఆటో డ్రైవర్స్ నష్టపోతున్నారని, ప్రభుత్వం వారే ఒక యాప్ ఏర్పాటు చేయాలన్నారు. ఆటో ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ చలనా ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని లేని పక్షంలో ఆర్థిక సహాయం అందించాలన్నారు. ఆటో, ఇతర ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీల వేధింపులు అరికట్టాలన్నారు. ఫిట్ నెస్ నిర్ధారణ ప్రైవేటు సంస్థను రద్దు చేసి, ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకట్రావుకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దువ్వా శేషుబాబ్జి, చెక్కల రాజ్ కుమార్ పాల్గొన్నారు.

వికసిత్ భారత్‌కు బలమైన పునాదులు అవసరం



వర్క్‌షాపులో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ మనీషా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): మన దేశం వికసిత్ భారత్‌వైపు పయనించాలంటే ముందుగా బలమైన మానవ వనరులు అవసరమని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ మనీషా పేర్కొన్నారు. జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో మంగళవారం వికసిత్ భారత్‌లో భాగంగా స్కూలింగ్–బిల్డింగ్ బ్లాక్స్ అనే అంశంపై జిల్లా స్థాయి వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ మనీషా మాట్లాడుతూ మానవ వనరులకు పునాది మన పాఠశాలలని, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. అప్పుడే విద్యార్థులు పూర్తిస్థాయిలో చదువుకుంటారన్నారు. ఈ సమావేశంలో ఆర్‌జేడీ నాగమణి, డీఈఓ పిల్లి రమేష్, ఏసీపీ వేణుగోపాలరావు, ఏఎంఓ జగన్మోహనరావు, మండల విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

ఈ ఏడాది థీమ్ ఆన్సర్ ది కాల్

నేడు అవయవ దాన దినోత్సవం

కాకినాడ రూరల్: దానాల్లోకల్లా అవయవ దానం ఎంతో గొప్పది. అవయవ దానమంటే మనిషి మరణించినా తన అవయవాల ద్వారా జీవించిఉంటాడు. ఈ అవయవాల దానంపై అవగాహన ఉన్న వారే తమ కోరికను కుటుంబ సభ్యుల ద్వారా నెరవేర్చుకుని ఎందరో జీవితాలకు వెలుగులు నింపుతారు. ప్రతి ఏటా ఆగస్టు 13న అవయవ దాన దినోత్సవం జరుపుకొంటారు. ఈ ఏడాది థీమ్ ఆన్సర్ ది కాల్‌ని మంగళవారం ఏర్పాటు చేయనున్నారు. దీని ముఖ్య ఉద్దేశమేమింటే అవయవ మార్పిడి కోసం ఎదురు చూస్తున్న వారికి అవయవ దానం ద్వారా వారి జీవితం వెలుగుని నింపడమే. ఇది పూర్తి అవగాహనతో ఉన్నవారితోనే సాధ్యమవుతుంది. జీవిత కాలంలో ఒక కిడ్నీ, కాలేయ భాగం దానం చేయవచ్చు. బ్రెయిన్ డెత్ లేదా మరణం తరువాత అనేక అవయవాలు అంటే గుండె, కాలేయం, రెండు కిడ్నీలు, ఊపిరితిత్తులు, పాంక్రియాస్, కార్నియా, చర్మం, ఎముకలు దానం చేయవచ్చు. అవయవ దానం వలన కనీసం 8 మంది ప్రాణాలను కాపాడగలము. 50మందికి పైగా వారి జీవన నాణ్యతను మెరుగుపరచగలరు.

దాతలు పేర్లను నమోదు చేయించుకోవాలి



అవయవ దానంపై ప్రజల్లో అవగాహన పెరుగుతుంది. ఇంకా పెరగాలి. ఇందుకు కుటుంబ సభ్యులు ప్రేరణ నింపాలి. అవయవ దానం కోసం దాతలు తమ పేర్లను నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ గుర్తింపు పొందిన సంస్థలు, ఆస్పత్రుల ద్వారా నమోదు చేసుకోవచ్చు. అవయవ దాత నిర్ణయం ఒక పిలుపునకు స్పందించడం కిందకు వస్తుంది. ప్రతి ఒక్కరూ ఈ పిలుపు వినాలి, స్పందించాలి. పేర్లు నమోదు చేసుకోవాలి.

– డాక్టరు డీవీఎస్ సోమయాజులు, నెఫ్రాలజిస్ట్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజిషియన్, కాకినాడ

ఎట్ హోంకు నేహాంజలికి ఆహ్వానం



విద్యార్థి నేహాంజలి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ప్రతి సంవత్సరం గవర్నర్ నివాసంలో జరిగే ఎట్ హోం కార్యక్రమానికి పదో తరగతి ఫలితాల్లో 600కి 600 మార్కులు సాధించిన శాంతినగర్ విద్యార్థిని యాళ్ల నేహాంజలి ఎంపికయ్యారు. తమ విద్యార్థినికి ఈ అరుదైన గౌరవం సాధించడం తనకు ఎంతో సంతోషంగా ఉందని భాష్యం విద్యాసంస్థల ఈస్ట్‌జోన్–1 ఇన్‌చార్జి వి.గోవిందరాజులు మంగళవారం విలేకర్లకు తెలిపారు. నేహాంజలిని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ, వైస్ చైర్మన్ హనుమంతరావు, డైరెక్టర్ సాకేత్‌రామ్ అభినందించారు.